తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

మారేడ్‌పల్లి, జూన్ 13 : కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ ఐదో వార్డులోని సంజీవయ్యనగర్‌లో ప్రభుత్వ నిధులతో మంజూరైన బోర్‌వెల్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలో నెలకొన్న సమస్యల పై తనకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందని..దశల వారీగా ప్రత్యేక నిధులను తీసుకొని వచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రానున్న వర్ష కాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి వరకు కంటోన్మెంట్ బోర్డు అధికారులకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంకి రవీందర్, శ్యాంసుందర్‌రెడ్డి, నగేష్ యాదవ్, భాస్కర్ గౌడ్, విక్కీ, సాయి, సంతోష్ యాదవ్, సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యనగర్‌లో బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనానికి కృషి

కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే వరకు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఈ మేరకు ఆరో వార్డు పరిధిలోని బోయిన్‌పల్లి డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ వెజిటేబుల్ మార్కెట్ యార్డులో కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను మార్కెట్ కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మార్కెట్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు మిర్యాల శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, చంద్రారెడ్డితో పాటు కమీషన్ ఏజెంట్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బలవంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, సాంసన్, రైమండ్, నరేష్, డెంజిల్, సంతోష్ యాదవ్, భిక్షపతి, విష్ణు, రేపల్లె వెంకటేష్, శరత్, ప్రతాప్ పాల్గొన్నారు.

అండగా ఉంటా..! తనను ఆదరించి గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు.ఏడో వార్డు తిరుమలగిరి ఇన్‌ఫాంట్ జీసస్ కాలనీలో బస్తీ వాసులు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీ కమ్యూనిటీ హాల్‌లో ఉన్న డంపింగ్ యార్డును తొలగించి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మేరీ, రేమండ్,పూల రమేష్,రవీందర్ గుప్తా, విజయ్,పాల్‌రెడ్డి పాల్గొన్నారు. – బొల్లారం

యువకుడి అదృశ్యం

నగిరి నవీన్ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ న్యూ గోదావరి హాస్టల్‌లో ఉంటున్న యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు యువకుడి తండ్రి ఓయూ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన నగిరి నవీన్ (23) ఐదేళ్లుగా చదువుకునేందుకు నగరంలో ఉంటున్నాడు. అయిదారు నెలలుగా స్నేహితులతో కలిసి న్యూ గోదావరి హాస్టల్లో నాన్‌బోర్డర్‌గా ఉంటున్నాడు. మే నెలలో స్వగ్రామానికి వచ్చి 21న హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఫోన్ చేస్తే స్పందించడం లేదని, ఇంటికి సైతం రాలేదు. ఆ తరువాత ఒక రోజు ఫోన్ చేసి తనకు డబ్బు అవసరం ఉందని, తన మొబైల్ ఫోన్ నెంబర్ సైతం మార్చినట్లు తండ్రికి వివరించాడు. పది రోజులుగా కొత్త ఫోన్ నెంబర్ సైతం పనిచేయడంలేదు. దీంతో నవీన్ తండ్రి ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'బండి'కి శుభాకాంక్షలు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో గురువారం బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కు మార్‌ను ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్, బీజేపీ నాయకులు సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రంలో మర్రి శశిధర్‌రెడ్డి మనువడు ఆర్యన్ కూడా ఉన్నారు.
– అమీర్‌పేట్, జూన్ 13

మరో అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలి

రైల్వే అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, జూన్ 13 : మెట్టుగూడ డివిజన్‌లో రైల్వే అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీతా రమేష్ గురువారం పర్యటించారు. అండర్ పాస్ బ్రిడ్జి లేకపోవడం వల్ల వాహనదారులు పడుతున్న ఇబ్బందులను కార్పొరేటర్ రైల్వే అధికారులతో చర్చించారు. డివిజన్‌లో ప్రజా అవసరాల దృష్ట్యా మరో అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని ఆమె అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... బ్రిడ్జిని నిర్మించడం ద్వారా వాహనదారులు చుట్టూ తిరిగే అవసరం లేకుండా సులువుగా రాకపోకలను సాగించవచ్చునని ఆమె తెలిపారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారం

బన్సీలాల్‌పేట్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కే.హేమలత

బన్సీలాల్‌పేట్, జూన్ 13 : డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత అన్నారు. గురువారం బన్సీలాల్‌పేట్ ఏ క్లాస్ కాలనీలో రూ.2.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న నూతన తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ పనులను ఆమె ప్రారంభించారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ద్వారా మంజూరైన నిధులతో డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం పనులు మొదలుపెడుతున్నామని ఆమె తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పనులు కొంత ఆలస్యంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సంధ్య, బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, ఫహీమ్, రజాక్, కమల్‌కుమార్, నాగభూషణం, అబ్బాస్, కుశాల్, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, రుక్ముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఒకటో వార్డు చిన్నతోకట్టలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ , తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. – మారేడ్‌పల్లి

బీఏఎస్ఎల్పీ రివాల్యుయేషన్‌కు
దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్పీ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏఎస్ఎల్పీ మొదటి, రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 20లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 22వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 22లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

18 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 18నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం అయిదున్నర గంటల నుంచి ఏడు గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9703589689, 798990 3001 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

బీఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

చంద్రబాబుకు మద్దతుగా నినదిస్తున్న విద్యార్థి నాయకులు, టీడీపీ నేతలు

బాబు సీఎంగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా..

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సీబీఎన్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ ప్రజలు అత్యంత తెలివి ప్రదర్శించి సరైన నాయకుడిని ఎన్నుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, టీడీపీ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చేర్పించాలి

వడ్డెరబస్తీ అంగన్‌వాడీ టీచర్ శోభరాణి ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బస్తీల్లో తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సమృద్ధిగా అందుతుందని వారు తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఈ సందర్భంగా కోరారు.
– అడ్డగుట్ట, జూన్ 13 :

వైద్యం వికటించి మహిళ మృతి

ప్రవళిక(ఫైల్)

మూసాపేట, జూన్13: వైద్యం వికటించి ఓ ప్రైవేట్ దవాఖానలో మహిళ మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం... సనత్‌నగర్‌కు చెందిన ప్రవళిక(29) మార్చి 18న సనత్‌నగర్ నుంచి బీరంగూడకు వెళ్తుండగా అల్సాబా హోటల్ వద్ద ప్రమాదానికి గురైంది. వెంటనే 108 సాయంతో స్థానిక అమ్మోర్ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి తొడ, తొంటి భాగంలో ఫ్యాక్చర్ అయిందని, సర్జరీ చేయాలని రూ.3లక్షలు ఖర్చు అవుతుందని చెప్పి చికిత్స ప్రారంభించారు. రెండు నెలలుగా పలు సర్జరీల పేరిట రూ.16లక్షలు వసూలు చేశారు. బుధవారం ఉదయం నుంచి ప్రవళిక ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందని, వైద్యానికి స్పందించడంలేదని, వెంటిలెటర్‌పై చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రవళికను చూపించకపోవడంతో ఆసుపత్రి వర్గాలను బంధువులు నిలదీయగా మృతి చెందినట్లు చెప్పారు. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువురితో చర్చలు జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు.

స్పందించని జిల్లా వైద్యాధికారులు

గత కొన్ని రోజులుగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఉన్న పలు ప్రైవేటు దవాఖానల్లో అమ్మోర్ దవాఖానలో జరిగిన ఘటనలు జరుగుతున్నా జిల్లా వైద్యాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు, ప్రమాదాలకు గురై చికిత్స కోసం వెళ్లిన రోగులు విగత జీవులుగా మారుతున్నారని బాధిత కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా మృతి చెందిన రోగులను వెంటిలెటర్లపై పెట్టి, లక్షల రూపాయల బిల్లులు దండుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అయితే గురువారం జరిగిన అమ్మోర్ హాస్పిటల్ ఘటనపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారిని వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన స్పందించకపోవడం గమనార్హం.

హోటల్ మేనేజ్‌మెంట్
కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు రెండు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

డీడీఎంఎస్‌లో వివిధ కోర్సులకు
దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్సు కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, మిగిలిన కోర్సులకు కనీస అర్హత పదో తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 63058958 67 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.రెండు వేల కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతగా తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ కోటూరి మానవతారాయ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఓయూ క్యాంపస్‌లోని జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానవతారాయ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతానని రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, నరేశ్‌గౌడ్, నాగరాజు, మణికంఠ, అశోక్, విజయ్, శ్రీకాంత్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ ప్రాంతంలో కురిసిన వర్షానికి మనోహర్ టాకీస్ వద్ద వరద నీరు, జలమయమైన రోడ్డు

లష్కర్‌లో జోరు వర్షం

కంట్రోల్ రూం ఫోన్ నెంబర్.040- 2111111

- వర్షపు నీరు నిల్వకుండా చూస్తాం
- జోనల్ కమిషనర్ రవి కిరణ్
- చెట్టుకొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగి పడితే తొలగింపునకు చర్యలు

సికింద్రాబాద్/బేగంపేట్ ,జూన్13 : వర్షపు నీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు చేపట్టామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ అన్నారు.వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. గురువారం కురిసిన వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్త కుండా ఇతర సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి గాని లేదా, కంట్రోల్ రూం ఫోన్ నెంబర్.040– 2111 111కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సికింద్రాబాద్ జోన్ పరిధిలో వర్షపు నీరు నిలువ ఉంటే 17 స్థలాలను గుర్తించామన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ రవి కిరణ్ మాట్లాడుతూ.. నార్త్ జోన్ పరిధిలో ఎక్కడ వర్షపు నీరు నిలిచినా, చెట్ల కొమ్మలు రోడ్లపై ఉన్నా వాటిని వెంటనే తొలగించ నున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పరిధిలో వర్షం కురిసిన ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో కలిసి పర్యవేక్షిస్తున్న జోనల్ కమిషనర్ రవి కిరణ్ తదితరులు

లోతట్టు ప్రాంతాల జలమయం

సికింద్రాబాద్, బేగంపేట్ ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తారు నుంచి జోరు వాన కురిసింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ప్యాట్నీ, రాణిగంజ్, మినిస్టర్‌రోడ్డు, మోండా మార్కెట్, రాష్ట్రపతి రోడ్డు, ఎంజీ రోడ్డు, పీజీ రోడ్డు, బేగంపేట శ్యాంలాల్, అల్లంతోట బావి, మయూరిమార్గ్, ప్రాంతంలో భారీ వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డాయి.

మార్కెట్‌కు వచ్చిన కొనుగోలుదారులు కొంత ఇబ్బందులు పడాల్సి వచ్చింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నిలిచిన వర్షం నీటిని జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి మ్యాన్‌హోల్స్ ద్వారా నీటిని పంపించేందుకు ఎక్కడా కృషి చేసిన దాఖలాలు కనిపించలేదు. రానున్న రెండు రోజుల్లోనూ కొద్ది పాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

సికింద్రాబాద్‌స్టేషన్ రోడ్డులో..

డివిజన్‌లో అభివృద్ధి
పనులు చేపట్టాలి

కార్పొరేటర్ సామల హేమ

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్,జూన్13: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ఆమ్రపాలిని కార్పొరేటర్ హేమ కోరారు.ఈమేరకు అదనపు కమిషనర్ ఆమ్రపాలిని గురువారం ఆమె కార్యాలయంలో కార్పొరేటర్ కలిసి తమ డివిజన్‌లో అభివృద్ధి పనులను చేపట్టాలని సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కంటే ముందు ఉన్న సీసీ రోడ్ల టెండర్లు రద్దు అయినందున మళ్ళీ రీటెండరింగ్ చేసి అభివృద్ధి పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.డివిజన్ పరిధిలోని మహ్మద్ గూడ,బ్రాహ్మణ బస్తీ, జోషి కాంపౌండ్,భవానీనగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్డు పనుల టెండరింగ్ ప్రాసెస్ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే పారిశుద్ధ్య కార్మికులు పదవీ విరమణ చేసిన వారి స్థానంలో నూతన కార్మికులను రిక్రూట్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బక్రీద్ పండుగ దృష్టిలో పెట్టుకొని గార్బేజ్ బ్యాగులు సరిపడే విధంగా చూడాలని అని కార్పొరేటర్ హేమ కోరారు.

నివాళి: తలసాని శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ నాయకులు పీఎల్. శ్రీనివాస్, పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు – మారేడ్‌పల్లి

బ్లాక్‌మార్కెట్‌కు రేషన్ బియ్యం

9 మందిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రేషన్ బియ్యాన్ని నల్లబజార్‌కు తరలిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి, 46 క్వింటాళ్ల బియ్యం, 4 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రమ్మీపెరుమాల్ కథనం ప్రకారం... లబ్ధిదారులు తీసుకునే సబ్సిడీ బియ్యాన్ని తక్కువ ధరకు కొందరు కొని వాటిని ఎక్కువ ధరకు నల్లబజార్‌కు తరలించే ముఠాలకు విక్రయిస్తున్నారు. హుమాయిన్‌నగర్, చిలకలగూడ, ముషీరాబాద్, మలక్‌పేట్, యాకుత్‌పురా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇలా జరుగుతుందని సమాచారం రావడంతో రైస్ బ్లాక్‌మార్కెట్‌కు తరలించే వారిపై నిఘా పెట్టి 9 మందిని అరెస్ట్ చేశారు. నిందితులు అత్తాపూర్‌కు చెందిన విశాల్ యాదవ్, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ నజీర్, వారాసిగూడకు చెందిన మహ్మద్ షోహెబ్, మహ్మద్ జంగీర్, ఎండీ షాహబాజ్, సరూర్‌నగర్‌కు చెందిన సంగం లోవ అలియాస్ రాజు, పటేల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రహీమ్, అంబర్‌పేట్‌కు చెందిన సయ్యద్ నజీమ్, మహ్మద్ మజహర్‌లను అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ. 2.5 లక్షల విలువైన బియ్యం, గోధుమలతో పాటు ఓ బైక్, లారీని స్వాధీనం చేసుకున్నారు.